

# అమెరి'కా'లేజ్

## - లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**"ఇండియానాలో** రూము చూసుకున్నావా?" త్రివేణి అడిగింది.

"లేదు వెళ్ళాక వెతకాలి" బదులిచ్చాను.

"వర్షిణి వాళ్ళు ఆల్రెడీ చూసుకున్నారట. ఇండియన్ స్టూడెంట్స్ అకామడేషన్ అలాట్ చేసారట. నాకు తెలిసిన వాళ్ళందరూ రూం చూసేసుకున్నారు"

"ఔనా? నేను ఇవాళ మా యూనివర్సిటీ వాళ్ళకి ఈ మెయిల్ పంపుతా"

"ఇంకా ఎన్ని రోజులుంటావు మీ అన్నయ్య దగ్గర?"

"ఇంకా మూడురోజులు"

"సండే వెళ్తున్నావా?"

"లేదు సాటర్ డే మూడో రోజు మధ్యాహ్నం ఫ్లైట్"

"ఓ అయితే ఫుల్ డే ఉండేది ఇవాళతో కలిసి మూడురోజులన్నమాట"

"యా. ఔను" అంత విడమరిచి తను చెప్పేసరికి దిగులు మొదలైంది.

"ఇంకా ఏం పనులు మిగిలాయి?"

"స్లీపింగ్ బాగ్, కంఫటర్ కొనాలి. తరువాత పేక్ చెయ్యాలి. అంతే"

"నైస్. మీ మమ్మీ ఎలా ఉన్నారు?"

"బానే ఉంది. మాట్లాడి రెండు రోజులౌతుంది."

"ఏం?"

"లేట్‌గా లేచా. రాత్రి బయటికి వెళ్ళి వచ్చాక అన్నయ్య నిద్రపోతాడని మాట్లాడలేదు. అనవసరంగా మళ్ళీ డిస్టర్బ్ అవుతుందనిపించింది"

"ఓ మీ డాడీ ఎలా ఉన్నారు? దిగులు పడ్డారా?"

"బానే ఉన్నారు" నాన్నతో వచ్చినప్పటి నుండి మాట్లాడలేదని గుర్తొచ్చి బాధపడ్డాను.

"విజయ్‌తో చెప్పావా నితిన్ గురించి?"

"లేదు, సారీ. మర్చిపోయాను. మెసేజ్ పెడతా. లేచాక చూసుకుని కాల్ చేస్తాడు."

"సారీ అక్కర్లేదులే. మా నాన్న క్లాస్ పీకితే వింటున్నట్టే తలూపాడు కానీ లోపలికి వచ్చి హాస్టల్‌లోనే ఉంటానన్నాడు."

"ఔనా. విజయ్ చూసుకుంటాడులే"

"థాంక్స్ నేను పడుకుంటా ఇంక. రేపు మాట్లాడదామా?"

"సరే. గుడ్‌నైట్."

భోజనం పూర్తయ్యాక విజయ్‌కి 'ఫ్రీగా ఉన్నప్పుడు కాల్ చెయ్య'మని మెసేజ్ చేసాను. ఆ తరవాత పర్ డ్యూ యూనివర్సిటి వెబ్ సైట్‌లో ఇండియన్ స్టూడెంట్ అసోసియేషన్‌ని వెతికి ఎయిర్‌పోర్ట్ నుండి పికప్‌కి ఫార్మ్ నింపాను. అది పూర్తయిన వెంటనే అకామడేషన్ కావాలని వాళ్ళకి ఈ మెయిల్ పంపాను. 'ఎ వాక్ టు రిమెంబర్' చదవాలనే కోరిక ఎంత మాత్రమూ కలగలేదు. సినిమా చూసేకన్నా చదువుతున్న దానివల్ల బాధ అధికంగా కలుగుతుందని అర్థమయ్యింది. 'వన్స్ అపా నె టైం'ని టీవీలో చూస్తుండగా తలుపు చప్పుడైంది. ఉలిక్కిపడి చూసేసరికి అన్నయ్య వచ్చాడు.

"అప్పుడే వచ్చావేంటి?" టీవీ మ్యూట్ చేస్తూ అడిగాను.

"ఒసేయ్. వెళ్ళేలోపు కనీసం ఒక్కరోజైనా 'అప్పుడే వచ్చావేంటి? ఆఫీస్ అయిపోయిందా?' అనకుండా కాస్త టైం చూసుకుని ఉండు" నవ్వాడు.

టీవీ వైపు చూస్తే మూడు ఎపిసోడ్లు చూసానని అర్థమైంది. అంటే నేను తెలియకుండానే ఒక కునుకు తీసానన్నమాట.

"రాత్రి సరిగ్గా నిద్రపట్టలేదు. తెలియకుండానే పడుకున్నాను"

"పర్లేదులే. ఇంకా కొన్ని రోజులే నీ ఫ్రీడం. ఎంజాయ్ చెయ్యి. ఇండియానాకి వెళ్ళాక నీకు ఇంత ఫ్రీ టైం ఉండదు"

"ఇవాళ ఏం చేద్దాం?"

"భోంచేద్దాం"

అర్థంకాక అన్నయ్య మొహం చూసాను.

కాస్త నవ్వి "నీకు ఇవాళ ఒక సూపర్ డూపర్ కాకర కాయ కూర వండుతా" అన్నాడు.

"సరే" ఆకలి మొదలైంది.

"షాపింగ్‌కి రేపు వెళ్దామా?" అడిగాను.

"మళ్ళీ షాపింగ్ ఏంటి? నిన్నే చేసాంగా? కాస్త ఆశ్చర్యంగా, కాస్త కోపంగా అడిగాడు.

"కంఫటర్, స్లీపింగ్ బాగ్ కొనాలి ఇంకా"

పెద్దగా నవ్వి "అవి అక్కడికి వెళ్ళాక కొనుక్కో. ఇక్కడ్నించి తీసుకెళ్ళలేవు"

"ఏং?"

"సూట్‌కేస్‌లో సరిపోవు అక్కడ కారున్న వాళ్ళని వాల్‌మార్ట్‌కి తీసుకెళ్ళమని అక్కడే కొనుక్కో. నేను నీకు వాటన్నిటికీ సరిపడా డబ్బులు ఇస్తాను. వెళ్ళిన రెండు రోజుల్లో బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి కాష్ అంతా డిపాజిట్ చెయ్యి. ఎక్కడికి వెళ్ళినా కార్డేవాడు. ఇక్కడ కాష్ తీసుకెళ్ళడం అంత సేఫ్‌కాదు."

"బాంక్‌కి నువ్వు తీసుకెళ్ళచ్చుకదా?"

"మీ ఊళ్ళో ఏం బాంక్ ఉంటుందో తెలీదు నాకు. అన్నీ బాంక్స్ అన్ని ఊళ్ళలో ఉండవు. కావాలంటే అక్కడ ఏ బాంక్ ఉంటుందో కనుక్కో. అక్కడ అకౌంట్ ఓపెన్ చేయిస్తాను. ముందే మీది చిన్న ఊరు"

"సరైతే" ఇన్ని పనులు నేను చెయ్యగలుగుతానో లేనో? అక్కడ సహాయం చెయ్యడానికి ఎవరైనా ఉంటారో, లేక అన్నయ్యలా నేను కూడా చాలా ఇబ్బంది పడాల్సొస్తుందో అని ఆలోచిస్తూ కాస్త భయపడుతుండగా "నేను స్నానం చేసొస్తా" అన్నాడు అన్నయ్య.

వెంటనే నేను బియ్యం కడిగి నాన్నబెట్టాను.

"కూరగాయలు కొయ్యనా?" అన్నయ్య స్నానం నుండి వచ్చాక అడిగాను.

"టమాటాలు, ఉల్లిపాయలు కోస్తూండు. నేను కాకరకాయలో గింజలు తీస్తాను"

ఇద్దరం కలిసి కబుర్లు చెప్పుకుంటూ వంట పూర్తి చేసాము. తినడానికి కూర్చున్నప్పుడు మొదటి ముద్దని కలుపుతుండగా" చేదు రాదు.

కానీ అది కాకరకాయ అని మర్చిపోకు" హెచ్చరించాడు.

"సరే" మొదటి ముద్దని ఏ రుచీ ఆశించకుండా నోట్లో పెట్టుకున్నాను. ఆశ్చర్యంగా రుచి నాకు విపరీతంగా నచ్చింది. కటిక చేదుకాక చిరు చేదుంది. టమాటాలు కాస్త పులిసినవి కావడంతో కమ్మదనం చేదుకి సరిగ్గా సరిపోయింది.

"ఇంత మంచి కాకరకాయ కూరని ఇప్పటివరకు తినలేదు" కళ్ళు విప్పారించి చెప్పాను.

"నువ్వు కూడా వండుకుంటూ ఉండు. కాకరకాయ వంటికి చాలా మంచిది. ముక్కలు చిన్నగా కోస్తే త్వరగా వేగుతాయి. బద్ధకంగా పెద్ద ముక్కలు కోస్తే వంట పూర్తయ్యేసరికి గంటసేపు పడుతుంది"

"ఓ. సరే అయితే"

భోజనం పూర్తయిన కాసేపటికి "స్లీపీ టైం. టీ తాగుతావా?" అడిగాడు.

"యా, తాగుతా"

అన్నయ్య రెండు కప్పులు టీ కలిపి సోఫాలో నా పక్కన కూర్చున్నాడు.

ఓ కప్పు చేతిలోకి తీసుకుని "సినిమా చూద్దామా?" అడిగాను.

"నేను పొద్దునే లేవాలి. కావాలంటే టీ తాగేంతసేపు ఏమైనా చూద్దాం"

"సరే. నువ్వే ఏదో ఒకటి పెట్టు"

"ఫన్నీది ఏదైనా పెడతా కాసేపు హాయిగా నవ్వుకోచ్చు" అంటూ బాలకృష్ణ సినిమాలో ఒక సీన్ చూడమని టీవీలో పెట్టాడు.

"ఏంటిది?"

"జస్ట్ ఎ సీన్"

"టెన్ మినిట్స్ కూడా లేదుగా?"

"టీ తాగడానికి అంత టైం పట్టదుగా?" ఎదురు ప్రశ్నించాడు.

ఈలోగా వీడియో ప్లే అయింది. బాలకృష్ణ, శుభలేఖ సుధాకర్ జాగింగ్‌కి వెళుతున్న సీన్. ఓ రోజు ఎప్పటిలాగే జాగింగ్‌కి వెళ్ళినప్పుడు ఒక అమ్మాయి ఇంటిముందు ఆగిపోయిన బాలకృష్ణ పక్కనే ఆగిన బండి వాడి దగ్గర ఉన్న అరటిపళ్ళు తింటాడు. తీరా బండి వాడు బయలుదేరే సమయానికి తన దగ్గర డబ్బులేదన్న బాలకృష్ణతో గొడవ పెట్టుకున్న బండివాడు, శుభలేఖ సుధాకర్ పదిరూపాయల నోటు చూపించినా ఓ నిమిషం పాటు గొడవ ఆపకపోవడం ఎందుకో నవ్వు తెప్పించింది. మీకు నవ్వు రాకపోవడంలో తప్పు అసలే లేదు. అది చూస్తే నవ్వు తెప్పించే సంఘటన, చదివితేకాదు. ఈలోగా టీ కూడా పూర్తవ్వడంతో గదిలోకి వెళ్ళి నిద్రపోయాను. పడుకున్న రెండు నిమిషాలకే మెలుకువ వచ్చింది. ఇవాళ కూడా నిన్నటిలా జాగారమా అని బాధ పడుతుండగా బయట ఏదో చప్పుడైంది. అన్నయ్యకి కూడా నిద్రపట్టడంలేదా, లేక బాత్‌రూంలోకి వెళ్ళాడా అని కొన్ని నిముషాలు ఆగాను. అన్నయ్యకి కూడా నిద్ర పట్టట్లేదు అని నిర్ధారించాక ఎందుకైనా మంచిదని నిదానంగా తలుపుని శబ్దం రాకుండా తెరిచే ప్రయత్నం చేసాను. బయటికి అడుగు పెట్టగానే

"గుడ్ మార్నింగ్ అప్పుడే లేచేసావే?" అన్నయ్య అడిగాడు.

"గుడ్ మార్నింగా?" అయోమయంగా అడిగాను.

"ఒసేయ్, సాయంత్రమైతే 'అప్పుడే సాయంత్రమా' అంటావు. పొద్దునైతే 'అప్పుడే పొద్దునా' అంటావు. నీ వ్యవహారం ఏంటసలు?" నవ్వుతూ అడిగాడు.

"ఇందాకే పడుకున్నట్లుంటేను.."

"గుడ్ సౌండ్ స్లీప్ అన్నిటి కన్నా మంచిది. బ్రైన్, బాడీ రెండూ రీచార్జ్ అవుతాయి. దాన్ని వల్ల మెమరీ ఇంప్రూవ్ అవుతుంది. పొద్దున్నే లేచావుగా, కావాలంటే కొంచెం సేపు బయట వాకింగ్‌కి వెళ్ళు. ఈ టైంకి వెదర్ చాలా బావుంటుంది. ఇంటి చుట్టుపక్కలంతా నడవడానికి వాకింగ్ ట్రైల్స్ ఉన్నాయి. కానీ తప్పిపోకుండా దారి గుర్తుపెట్టుకో. అలానే మరీ ఎక్కువసేపు నడవకు. అలసిపోతే నేను వచ్చి పిక్ చేసుకోవడానికి గంటసేపు పట్టినా పడుతుంది. ఓ బాటిల్‌లో నీళ్ళు మర్చిపోకుండా తీసుకెళ్ళు" షూస్ వేసుకుంటూ చెప్పాడు.

"సరే. మంచి ఐడియా."

"నేను రేపు ఆఫీస్‌కి లీవ్ పెట్టాను. నీకు ఎక్కడికైనా వెళ్ళాలని ఉంటే చెప్పు. నువ్వు మర్చిపోయానవి ఉంటే గుర్తు చేసుకో. అక్కడికి వెళ్ళాక కష్టం. రేపు పొద్దున బయట పన్లు చూసుకుని సాయంత్రానికి సూట్‌కేసులు సర్దాలి. నిన్ను

ఎయిర్ పోర్ట్ నుండి ఎవరు పికప్ చేసుకుంటారో కనుక్కుని నాకు వాళ్ళ నంబర్ పంపించు. వాళ్ళకి కూడా నా నంబర్ ఇవ్వు. కమ్యూనికేషన్ చాలా ఇంపార్టెంట్" తలుపు దగ్గరికి నడిచాడు.

"ఫ్రిడ్జ్‌లో రాత్రి కాకరకాయ ఉంది. మొత్తం తిను. నా కోసం అట్టే పెట్టకు" కీస్ తీసుకున్నాడు.

"సరే"

"నేను ఆఫీసుకెళ్ళొస్తా. ఏదైనా అవసరమైతే ఫోన్ చెయ్యి. జాగ్రత్తగా ఉండు."

"సరే. బై అన్నయ్య"

అన్నయ్య తలుపు మూసి వెళ్ళగానే ఏదో దిగులు మొదలైంది. ఇవాళా, రేపు తరవాత కొత్త వాళ్ళతో కలిసి ఉండాలి. వాళ్ళు మంచివాళ్ళు కాకపోతే? నేను సర్దుకోలేకపోతే? అనవసరంగా ఇంత దూరం వచ్చానా? అన్నయ్య ఉన్న ఊళ్ళో చదువుకో అని అమ్మ చిలకకి చెప్పినట్టు చెప్పింది. నోరు మూసుకుని అమ్మ మాట వినాల్సింది అనుకుంటుండగా కళ్ళలోంచి ఓ బొట్టు చెంప మీదకి జారింది. అది తుడుచుకుంటూ, సర్లే ఈ రెండు రోజులయ్యాక ఎలా అయినా ఏడుపు తప్పదు. ఈ రెండు రోజులు కాస్త హాయిగా ఉంటాను అనుకుని అన్నయ్య సలహా పాటిద్దామని వాకింగ్‌కి వెళ్ళేందుకు తయారయ్యేందుకు వెళ్ళాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story